పిడకల గంప

శ్రీ కాపుటూరు వెంకటనారాయణరావు

(గతసంచిక తరువాయి)

"తన భర్త మరణించినా గానీ గుణవతి చింతించ లేదట! ఆనాడు, అతనిని చితిమీద చేర్చినపుడుగూడా చింతించలేదట! కన్నీరు గూడా కార్చలేదట! అది వూరివారందరినీ ఆశ్చర్యంలో ముంచివేసింది. గుణవతి "తన భర్త దైవాంశసంభూతుడు. అతనికిమరణంలేదు. నాకు విధవత్వంలేదు. నేను విధవను కానను కున్నదట!"

"గుణవతి వైఖరిచూచి ముత్తయిదువులు అసహ్యించుకున్నారు. విధవన్నారు. ప్రక్కరోజే వారి నోళ్ళన్నీ పడిపోయాయి. తమ తెలివితక్కువకు చింతించి నాగేశ్వరునికి మ్రొక్కుకున్నారు. అప్పటి నుండి గుణవతినిగురించి యెవ్వరూ యేమనుకునేవారు గాదు."

"ఆమె అంత పతివ్రత! ఇతర బ్రాహ్మణ పెద్దలు గుణవతి తండ్రిని బెదిరించారు ఆమెను దూరంగా వుంచాలని!"

"గుణవతి, తను పూర్వంలా పసుపు కుంకుమ ముట్టడం మానలేదు. అది చూచి కొందరు ఆమెను చూడడమేమానివేశారు. కొందరు అదిమంచిదిగాదని గుణవతి తండ్రిని మందలించారు. దీనికి వూరి ఆబాల గోపాలం ముక్కుమీద వేలిడారు!"

తలిదండ్రులు యీ అవమానానికి కృంగికృశించారు. గుణవతిని బెదిరించారు. ఆమె ప్రశాంతంగా "నాన్నగారు! నా భర్త తన దేహాన్ని విడిచి దైవంలో కలిసిపోయారు. నాకు అన్యాయంగా మీరు ఆరోపించే విధవత్వం నిజమో కాదో తెలుసుకోవాలనుకుంటే ఆ నాగేశ్వరునే అడగండి" అని బదులు చెప్పింది. దానికి గుణవతి తండ్రి 'నిజమేనా?' అనుకుని నిరూపణకు నిలిచాడు.

"ఆ ప్రక్కరోజే యీ గుడిముందు వూరిప్రజ గుంపుగా చేరింది నాయనా! వింతచూడడానికి అందరూ వచ్చినా గుణవతి వేదయ్యలు మాత్రం రాలేదట."

"గుణవతి తండ్రి యీ చెరువులో స్నానంచేసి శుచై, నాగేశ్వరుని కెదుట నిలబడి యీ అన్యాయమేమిటో తెలియజేయమని ప్రార్థించాడు. గుణవతికి అన్యాయం జరగడం దైవంగూడా సహించలేదు. గుడి గంటలు మారు మ్రోగాయి. గుడినిండా అవ్యక్త ధ్వనులు తాండవించాయి. మహేశ్వరుని మూడవ కన్ను తెరచినట్లు ఆలింగం వారికగుపించింది. అందరూ అతని పాదాల కొరిగి తప్పు క్షమించమని వేడుకున్నారు."

"తండ్రి మనసు, వూరివారి నోరు శాంతించాయి. వేదయ్య తన చెల్లెలు అసామాన్యురాలనుకున్నాడు. ఆమెనే దేవునిలా జాగ్రత్తగా చూస్తూవచ్చాడు."

"గుణవతికి పదునెనిమిదేండ్లు నిండాయి. ఆమె మనసు కామక్రోధాలకు దూరంచేయబడింది. అప్పటికామె తండ్రికి తొంబయ్యేండ్లు నిండాయి. అతను మంచం పట్టాడు. ఆ సమయంలో తన తండ్రికెంతో సేవచేసింది. గుణవతి. అతను ఆమె ప్రశాంతవదనంలోకి చూస్తూ స్వర్గ ద్వారం చేరుకున్నాడు."

"తల్లి బాధ్యత వారిద్దరిమీద పడింది. వారామెనెంతో జాగ్రత్తతో చూచారు. కానీ ఆమెగూడా త్వరలోనే తనభర్త సాన్నిధ్యంచేరింది. వారిద్దరూ అనాధులయ్యారు. కానీ పెద్దలను సత్కరించడంలో పూజించడంలో యేలోటూ రానివ్వలేదు. గుణవతిని చూచుకుని తన తలి దండ్రుల సంగతి మరచాడు వేదయ్య!"

"గుణవతిని ఒక్క క్షణం గూడా విడిచి వుండలేని వేదయ్యకు అప్పుడప్పుడు యెడబాటు కలిగేది. రాచకార్యాలతో యింటిలో వుండేవాడుగాదు. వూరి వారందరూ గలిసి వేదయ్యకు వివాహంచేసి, మరలా ఓ సంసారమని యేర్పడినందుకు సంతోషించారు.

"కానీ ఆ కోడలి ఆగమనమే యీ ఆడబడుచు అంతర్థానమయింది. ఆమె వీరింటిలో అడుగుపెట్టినపుడు గుడ్లగూబలు కూశాయంటారు! ఆమాతలతో వూరంతా కలవరపడింది. మరలా గుణవతికి యేదో మొప్పురానున్న దనుకున్నారు."

"వేదయ్య తన భార్యను గూడా చెల్లెలితో పాటు చూచేవాడు. కానీ గుణవతి పట్ల యే అశ్రద్ధ వహించేవాడుగాదు. ఆమెకు యేదన్నా ముప్పుగలిగితే లోకమే తల్లక్రిందు లౌతుందని భావించేవాడు. ఇది చూచి ఆమె వదినె సహించలేకపోయింది. ఈర్ష్యతో ఆమె హృదయం దహించుకుపోయింది. గుణవతిని చూచి ఆమె కళ్లు ఓర్చలేకపోయాయి."

"వేదయ్యకు రాచకార్యాలవల్ల గుణవతిని కనిపెట్టివుండను వీలులేకపోయేది. సమయం దొరికినప్పుడల్లా గుణవతిని అష్టకష్టాలు, నానాహింసలు పెట్టేది వదిన. వేదయ్య వూళ్లోలేని సమయంలో గుణవతిని పస్తుపెట్టేది. కానీ గుణవతి తనకష్టాలను యెవ్వరితో తెలిపేదిగాదు"

"వేదయ్య తన చెల్లెలు సుఖంగావున్నదని తలచేవాడు. అతనున్నప్పుడు ఆమెను వదిన అప్యాయంతో చూస్తున్నట్లు నటించేది. ఆ వదిన గుణవతికన్న యింటిపని మనిషిని ఆప్యాయంతో చూచేది. పని మనిషిచేసే పనులన్నీ గుణవతికి చెప్పేది. అంట్లు తోమడం మొదలు పిడకలేరేవరకు గుణవతేచేసేది. ఆమెకు నాగేశ్వరుని ధ్యానంతో యివేవీ లెక్కకు వచ్చేవిగాదు. కానీ దినదినానికి నీరసించి కృశించ సాగింది. వేదయ్య యిదేమీ గమనించలేదు."

"ఆనాడు దివాణంనుండి రాచనగరుకు వెంటనే రమ్మని వేదయ్యకు వార్తచేరింది. ఆనాడే గుణవతి బయట చేరింది! భార్యతో చెల్లెలి క్షేమం చెప్పి రాచనగరుకు బయలు దేరాడు వేదయ్య. యెదురుగా యెన్నో అపశకునాలతో అతని మనసు కలత చెందింది. వీటి అర్థమేమిటని యెన్నోవిధాల తలపోశాడు. కానీ రాచకార్యము, రాజాజ్ఞ అయినందువల్ల నేరుగా సాగిపోయాడు. వదిన సమయం దొరికిందని గుణవతిని చేతనయినంతవరకు హింసించింది. ఆ ముట్టు మూడురోజులు తిండికి వాచిపోయింది గుణవతి. చివరకు నీళ్ళయినా దొరికాయిగాదు. స్వతంత్రతకు ఆమె అంటు అడ్డుతగిలింది. ఆకలి దప్పులచేత సోలి పడిపోయింది. తుదకు నోటిలో యింటి యీనాది పనిమనిషిచేత నీళ్లు పోయించింది గుణవతికి."

"నాలుగవరోజు గుణవతికి అతికష్టంమీద స్నానమయింది. తన అన్నకోసం యెదురు చూచింది. అతను అప్పటికీ రాలేదు. నిరాశచెంది ఆకలికి ఆగలేక, అన్నం పెట్టమని తన వదినను ప్రార్థించింది. కానీ ఆనాడుగూడా ఆమెకు సరిగా తిండిదొరకలేదు. మరురోజు మూరు నీళ్ళతో గుణవతి అంటు తీరిపోయింది. ఆ నాడు ఆ గయ్యాళి వదిన గుణవతి చేతికి గంపయిచ్చి "చెరువుకుపోయి పిడకలు యేరుకు వస్తేగానీ అన్నంపెట్టను" అని బెదరించింది."

"గుణవతి గంపతీసుకుని యీ చెరువుకు వచ్చింది. గట్టుమీదనిలచి తన అన్నకోసం చూచింది. అతని జాడలేదు. యెలాగో, తను ఆకలితో దహించుకపోతున్నా, నాగేశ్వరుని ధ్యానంతో బుట్టనిండా పిడకలు తెచ్చేటప్పటికి సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు. ఆకలితో సోలి యింటికి వచ్చింది. అప్పటికీ ఆ గయ్యాళివదిన కఠిన హృదయం కొంచమైనా కరుగలేదు. "ఇంకా అన్నంకాలేదు మరోగంప పిడకలు తే" అని ఆజ్ఞాపించింది. గుణవతి నేను పోలేనని ప్రార్థిస్తే రోకలి మొనతో నడినెత్తిన పొడిచింది. "ఆ దెబ్బకు గుణవతి తల బ్రద్దలైంది. నెత్తురు సెలయేరులా ప్రవహించింది. ఆ యెండలో

చెమటగార్చుకుంటూ మరలా చెరువుకు బయలుదేరింది గుణవతి. చేతిలో గంప నిలవడంలేదు. కళ్లు తిరిగి పోతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. మెల్లగా యీ ఆలయం చేరుకుంది. గుడి తలుపులు యినుప ముద్దలతో బంధించివున్నాయి. ఆ తలుపులముందు వాలిపోయింది గుణవతి. గంపదొర్లి దూరంగా బోర్ల పడిపోయింది."

"దూరాన బండియెద్దు గంటల చప్పుడు గణగణ మని మారు మ్రోగుతున్నాయి. తన అన్న తిరిగి వస్తున్నాడు. యెద్దుమెడలోని గంటలమ్రోత వూరి చావిడి సమీపించింది."

"గుణవతి నాగేశ్వరుని ముందుపడి "ఓ దేవా! యీ కష్టాలు సైథరించలేను. నన్ను నీలో కలుపుకో మని" తల ఆ తలుపులకేసి బాదుకుంది."

"నాగేశ్వరుడు గుణవతిపడే బాధలను చూచి సహించలేకపోయాడు. తన మూడవకన్ను కొద్దిగా తెరిచాడు. గుడి తలుపులు ఫెళఫెళారావాలతో విరిగిపోయాయి. ఆ దివ్యమూర్తినిచూచి గుణవతి కళ్ళుమూసింది. అంతవరకు రుద్రమూర్తిగావున్న నాగేశ్వరుడు ప్రశాంతంగా నాట్యమాడుతున్నాడు. మహేశ్వరుడు తన బాహువులుచాచి గుణవతిని తనలో కలుపుకున్నాడు. మేఘసింహాలు జయ మన్నట్లు ఒక్కసారి గర్జించాయి. మరలా విరిగిన యీ తలుపులు యథా ప్రకారం మూసుకున్నాయి. అక్కడ బోర్లపడిన ఆ పిడకలగంప శిలగామారి పాతాళానికి వేళ్లుపెట్టింది."

"బండి యింటిముందాగింది. వేదయ్యకు యెదురుగా యెవ్వరూరాలేదు. కంగారుతో, ఆతృతతో యింట్లోకి పరిగెత్తాడు. తన చెల్లెలు అగుపించలేదు. భార్యను గద్దించాడు. ఆమె "పిడక లేరుకురాను పంపాను" అని యే అదురు బెదురులేకుండా చెప్పింది. వేదయ్యకు చెమటలుపోశాయి. యెద్దుల నదిలించే కర్రతో భార్యను యిష్టంవచ్చినట్లు బాదాడు. ఆమెకు వేదయ్య ప్రళయకాల రుద్రుడయ్యాడు. "ఛా! నీకు హృదయమనేదివుంటే ముట్టు మనిషిని పిడకలకు పంపుతావా పని మనుషులు లేక పోయారా" అని చెరువుగట్టుకు పరుగెత్తాడు.

"అప్పటికే ఆలయంలో ఓ శివలింగం పుట్టిందనీ, తెల్లగావుందని తెలిసి వూరివారందరూ, వింతను చూడడానికి వచ్చారు. వేదయ్యకు చెరువులో చెల్లెలిజాడ అగుపించలేదు. ఆ గుంపు దగ్గరికి పరుగెత్తాడు. శివలింగంలాంటి ఆ తెల్లనిగుండు అగుపించింది. "చెల్లీ" అని అరచి కలయదిరిగాడు. యేజాడా తెలియక పోయేటప్పటికి చివరకు నాగేశ్వరుని పాదాలు పట్టుకున్నాడు."

"ప్రకృతి భయంకరమైన ధ్వని ఆ సమయంలో వారికి వినిపించింది. ఆ ధ్వని మొదట వారి కవ్యక్తమైంది. తుదకు ఓ ప్రశాంత గంభీర కంఠం అందులో నుండి చొచ్చుకుని "యిక నేను యీ లోకానికి రాను. నా కోసం ఆశపడవద్దు. ఇకమీదట, యీ చెరువునీళ్లు, యీ వూరు బ్రాహ్మణుల కోడళ్లు, యీ వూరి బ్రాహ్మణ కుటుంబాలు రూపనాశనమవుతాయి" అన్న శాపవాక్యాలు వూరివారిని ప్రళయంలో ముంచివేసింది."

"వేదయ్య తన చెల్లెలు స్వామితో కలిసిపోయిందని తెలుసుకుని బావురుమన్నాడు. తననూ నీలో కలుపుకోమని నాగేశ్వరుని ముందు తలబాదుకున్నాడు. కానీ యేప్రయోజనం లేకపోయింది."

"అప్పుడే తన భార్య ఆ ఆడబడుచును పెట్టిన కష్టాలన్నీవిని వేదయ్య కన్నీరు విడిచాడు. చేసేదేమీలేక తన భార్యను ఆమె తలిదండ్రులవద్ద వదిలివేశాడు. ఆ మరునాటిరోజు వేదయ్య యేమయ్యాడో యెవ్వరికీ తెలియదు. అతనుగూడా నత చెలి జాడన నడిచాడనుకున్నారు."

"ఆ ఆడబడుచు శాపవాక్యాలకు భయపడి, వూరి బ్రాహ్మణులు అది మొదలు ఒక్కొక్కరే వూరువదిలి వెళ్ళిపోసాగారు. కొందరు నిలిచినప్పటికి వారి కుటుంబాలు నాశనమయ్యేవి. అది మొదలు వూరి భూముల నన్నిటినీ సస్యశ్యామలం చేయగల ఈ చెరువులో నీటి చుక్కకు కరువైంది. పచ్చని భూములన్నీ బీడులయ్యాయి. జీవనోపాధిలేక అందరూ వూరువిడిచి వెళ్ళారు."

"అప్పటినుండీ ఆ శిలను "పిడకలగంప" అని పిలిచేవారు. అదే నాయనా! నీవు చూచిన ఆ తెల్ల శివలింగం, ఆమె శాపవాక్యాలు నిజమయ్యాయి. ఈ వూరిలో యిప్పుడుండేది మూడు బ్రాహ్మణ కుటుంబాలే! వారిలో స్వార్థం, యీర్ష్య, వారిని అప్పుడప్పుడు భరించరాని కష్టాలకు దారితీస్తూ వుంటుంది. ఇవిగూడా కొద్ది రోజులపాటే! ఆ పిదప యీ జాతి యిక్కడ పూర్తిగా నశిస్తుంది."

"అప్పటినుండి యీ వూరికి ఆ ఆడబడుచు తల్లిదండ్రుల యింటిపేరు "గ్రిద్దలూరు" అని సార్థకమయింది. అప్పటినుండి వూరికి యేపీడకలుగకుండా నాగేశ్వరునితోపాటు ఆ పిడకల గంపనుగూడా పూజించేవారు. కానీ యిప్పుడు యిక్కడ నాగేశ్వరుని వైభవమే పూర్తిగా తగ్గిపోయింది. ఆ శిల మీద ఒక పుష్పంగూడా వేయలేకపోతున్నాం. కొందరు దుష్టులు ఆ శిలను నిర్లక్ష్యంచేసి పెకలింప జూచారు. మరుక్షణమే నెత్తురుగక్కి నాగేశ్వరుని పాదాలమీద పడిపోయారు,"

"వూరిలో యీ సంగతి తెలిసినవారందరూ, తమ వూరిలోని బ్రాహ్మణుల నాశనానికి ఆ ఆడబడుచు శాపవాక్యాలే నిజమని భావిస్తారు. ఇది నాయనా ఆ పిడకలగంప సంగతి!"

అని అర్చకుడు ఓ వేడి నిట్టూర్పు విడిచాడు. అప్పటికి బాగా చీకటి పడింది. అప్పుడే కృష్ణపక్షంలో అడుగుబెట్టిన చంద్రుని వెన్నెల చాలా హీనంగావుంది. చెరువులోవున్నకొద్ది నీటిలో చంద్రబింబం కదులుతుంది. దూరాన గనులలోని విద్యుద్దీప కాంతులు మెరిసి, నక్షత్రాలలో కలిసిపోయాయి. వూరిలో దీపపుబుడ్లు అక్కడక్కడ నీరసించి వున్నాయి. వాటిని, మసక వెన్నెలలోని ఆ మధుర ప్రకృతిని చూస్తూ, అర్చకుడు తెలిపిన సంగతి మనన చేసుకుంటూ, నిట్టూర్పులతో చెరువుకట్టదిగి తన వసతి తట్టునడిచాడు రాజు.